క్లుప్తంగా

అంకాళమ్మ ఆలయంలో హుండీ చోరీ

కోట: స్థానిక శ్యాంసుందరపురంలోని అంకాళమ్మ ఆలయంలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. గుడి తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. ఈ విషయమై ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు రూ.10వేల వరకు ఉంటుందని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

కోట: గూడలిలో ఆదివారం కోటకు చెందిన జనతా క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు షనీల్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. డాక్టర్లు జగదీష్, ఉమేరా, విక్రమ్‌రెడ్డి తదితరులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆములూరు నాగార్జున్, జెడ్పీటీసీ కోటయ్య, ఉపసర్పంచ్ విజయసారధిరెడ్డి, వెంకటక్రిష్ణయ్య, రాజనాల, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 45.750 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 45.750 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9800 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1500, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణాశాఖాధికారులు

చిల్లకూరు: వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని రవాణాశాఖాధికారులు ఆదివారం సూచించారు. గూడూరు బైపాస్ ప్రాంతంలోని చిల్లకూరు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. పలు వాహనాల కండీషన్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం వాహనాలకు సంబంధించిన రికార్డులు సరిగా లేని కారణంగా 18 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎల్‌యూ ప్రభాకర్‌రావు, శాంతి, సిబ్బంది నరేష్, శ్యామ్, సుధీర్ పాల్గొన్నారు.

ఏకాంత సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



గ్రామోత్సవంలో భక్తులను కటాక్షిస్తున్న స్వామి, అమ్మవారు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో జరుగుతున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఏకాంత సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో సెప్టెంబర్ 2 నుంచి అంగరంగ వైభవంగా జరుగుతున్న ఉత్సవాలు రాత్రి స్వామి, అమ్మ వార్ల ఏకాంత సేవతో పరిపూర్ణమయ్యాయి. స్వామి వారికి ప్రత్యేకపుష్పాలతో అలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులందరూ కొబ్బరి కాయలు సమర్పించార. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చికెన్ ధరలు		15-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	150
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	264
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	290
లేయర్ చికెన్	:	195



మేత భూముల్లో ముళ్ల చెట్లు తొలగిస్తున్న జేసీబీ



రోసనూరులో మేత భూములను చదును చేసిన దృశ్యం

కూటమి నేతల భూ మేత

- భూములను కబ్జా చేస్తున్న అధికార పార్టీ నేతలు
- మూగజీవాల పోషణ భారమేనంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పెళ్లకూరు: మండల పరిధిలో ఉన్న భూములను కూటమి నేతలు చెరపడుతున్నారు. మేత పోరంబోకు భూములను యథేచ్ఛగా కబ్జా చేసేస్తున్నారు. మండలంలోని రోసనూరు గ్రామంలో సర్వే నంబరు 276-1లో 28.31 ఎకరాలు మేత పోరంబోకు భూములు ఉన్నాయి. ఒక్కో ఎకరం భూమి రూ.10 లక్షలకు పైగా విలువ చేస్తుంది. ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడి మేత పోరంబోకు భూములను ఆధారం చేసుకొని గ్రామంలోని ప్రతి ఇంటా మేకలు, గొర్రెలు, గేదెలు, ఆవులు తదితర మూగజీవాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు స్థానికేతరులు ఈ మేత భూములను కబ్జా చేస్తున్నారు. వారం రోజులుగా యంత్రాలతో చెట్లు, పుట్టా తొలగించి మేత భూములను కబ్జా చేసి దున్నేస్తున్నారు. దాంతో గ్రామంలోని మూగజీవాలకు మేత కరువై కాపాడుకోవడం కష్టమని గ్రహించిన పలువురు పాడి రైతులు ఈ నెల 8న గ్రీవెన్స్‌లో స్థానిక తహసీల్దార్ హరికృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. కానీ రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవడంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని మేత భూముల్లో యంత్రాలు వేగం పెంచి కొండలను, బండలను పిండి చేస్తూ భూకబ్జా సాగిస్తున్నారు.



రోసనూరు మేత భూముల్లో చదును చేస్తున్న యంత్రాలు

మూగజీవాలకు మేత కరువు

గ్రామంలో ఉన్న మేత భూములు కబ్జాకు గురికావడంతో మూగ జీవాలకు మేత కరువైపోతుందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం చుట్టూ చిట్టడవి ఉండడం వల్ల గతంలో మూగజీవాల మేతకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదు. అయితే గత కొంత కాలంగా గ్రామం చుట్టూ ఉన్న రిజర్వ్ ఫారెస్టు భూములకు అటవీశాఖ అధికారులు పూర్తి స్థాయిలో కట్టుదిట్టంగా కంచె ఏర్పాటు చేసి ఎర్రచందనం, టేకు తదితర మొక్కలు నాటి సాగు చేస్తున్నారు. దాంతో రిజర్వ్ ఫారెస్టులోకి మూగజీవాలు మేతకు వెళ్లే పరిస్థితి లేదు. మిగిలిన ప్రభుత్వ మేత పోరంబోకు భూములు, చెరువుకట్టలు, తెలుగుగంగ కాలువ గట్లు మాత్రమే మూగజీవాలకు ఆధారంగా మారాయి. ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన స్థానికేతరులు మేత భూములను కబ్జా చేయడంతో పాడి రైతులు తమ పశువులను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమణకు గురైన మేత భూములను తక్షణమే విడిపించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రోసనూరు గ్రామంలో మేత భూముల కబ్జా విషయమై ఫిర్యాదు అందలేదు. వెంటనే స్థానిక గ్రామ రెవెన్యూ అధికారికి సమాచారం అందించి పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాము. – హరికృష్ణ, తహసీల్దార్, పెళ్లకూరు

నేడు గ్రీవెన్స్ రద్దు

ఓజిలి: మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ పద్మావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా గ్రీవెన్స్ కార్యక్రమం లేదని ప్రజలు ఎవరూ వెళ్లవద్దని సూచించారు.

క్రీడా జట్ల ఎంపికలు రేపు

చిట్టమూరు: రాష్ట్ర స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు సోమ, మంగళవారాల్లో జట్లు ఎంపిక చేయనున్నట్లు ఆదివారం మండల విద్యాశాఖాధికారి బీవీ క్రిష్ణయ్య తెలిపారు. మండలంలోని అరవపాళెంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 16, 17 తేదీల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, కబ్బడీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చదరంగం, క్రీడా పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన విద్యార్థులను జట్లకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అండర్-14 , అండర్-17 బాల, బాలికల జట్లును ఎంపిక చేస్తున్నామని ఈ పోటీల్లో పాల్గొనే వారు ముందుగా సోమవారం తమ పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎంఈఓ-2 భైపయ్య, హెచ్‌ఎం మంజుల, స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ భరత్ మహిపతి, పీడీలు నరేంద్ర, మధుసూదన్, శివ, సురేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

డీబీహెచ్‌పీ పరీక్షలకు 60 మంది హాజరు

కలువాయి(సైదాపురం): హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చీపినాపి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ (డీబీహెచ్‌పీ) నిర్వహించే పరీక్షల సంబంధించి 60 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్ జనార్దన్ రెడ్డి తెలిపారు. హిందీ భాషాదివస్ సందర్భంగా పరీక్ష నిర్వహించడం శుభపరిణామం అన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలను ఇబ్బంది పెడితే సహించం

కోట: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టే టీడీపీ నాయకులు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హెచ్చరించారు. మండలంలోని కర్లపూడిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర నివాసానికి మేరిగ మురళీధర్ విచ్చేశారు. ఇటీవల పాముల సురేంద్ర ప్రహరీ గోడను టీడీపీ నేతల మద్దతుతో కొందరు కూల్చివేశారు. ధ్వంసమైన గోడను నాయకులతో కలసి మేరిగ మురళీధర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం నిర్మించిన గోడను ఇప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూల్చడం సరికాదన్నారు. ఎస్‌ఐ పవన్ కుమార్ సివిల్ వివాదాల్లో తలదూర్చి అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్నారన్నారు. ఇటువంటి సంఘటనలను ఉపేక్షించేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, చెంచురాఘవరెడ్డి, నాగరాజు, కోటారెడ్డి, రాజారెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఉలస కస్తూరయ్య, నాగూర్‌యాదవ్, బుజ్జయ్య పాల్గొన్నారు.



కర్లపూడిలో కూల్చివేసిన గోడను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

రాపూరమ్మకు నెల పొంగళ్లు





రాపూరమ్మకు పొంగళ్లు పెడుతున్న మహిళలు, విశేషాలంకరణలో రాపూరమ్మ

రాపూరు: మండలంలోని గ్రామదేవత రాపూరమ్మ తల్లికి ఆదివారం మహిళా భక్తులు గ్రామ పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామంలోని మహిళలంతా పొంగళ్ల సామగ్రితో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూలంగిసేవ, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడంతో ఆలయంలో సందడిగా మారింది,

కృష్ణారెడ్డి సేవలు ఎన్నటికీ మరువలేం

సైదాపురం: వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ కమలపూడి కృష్ణారెడ్డి సేవలు నేటికి మరవలేనివని గ్రామ సర్పంచ్ పెంచలయ్య, ఆ పార్టీ నేతలు రాజా రెడ్డి, బీఎస్ యాదవ్ కొనియాడారు. చాగణం గ్రామంలో ఆదివారం కృష్ణారెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన అభిమాని కుమ్మరిగుంట చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 500 మంది పేదలకు చీరలను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమలపూడి చంద్రారెడ్డి, కమలపూడి సుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి, వేణురెడ్డి, చిరంజీవి, రవిచంద్ర, తిరుమల, ఆవులకృష్ణయ్య, ఎస్ రమేష్, మాణిక్యం, చెన్నయ్య, తిరుపాలయ, బలరామయ్య, జయరెడ్డి, బట్టా వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.



చీరలను అందజేస్తున్న నేతలు

అక్రమ కేసుల్లో కూటమి రికార్డు

- మితిమీరుతున్న హత్యలు, అత్యాచారాలు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి
- వేమారెడ్డి కుటుంబానికి పరామర్శ



వేమారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం శాశ్వతంగా అధికారం తమదే అన్న ధోరణిలో అక్రమ కేసులు పెట్టడంలో రికార్డు సృష్టిస్తోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అన్నారు. మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, ఆయన తల్లి శారదమ్మపై ఇటీవల పోలీసులు అక్రమ కేసులు బనాయించి కుమారస్వామిరెడ్డిని రిమాండ్‌కు పంపగా ఆయన విడుదలై బయటకు రావడంతో ఆదివారం కుమారస్వామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాకాణి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ అధికారం చేపట్టిన తరువాత కూటమి నాయకులు దోచుకో, దాచుకో అంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎక్కడ పడితే అక్కడ గంజాయి విక్రయాలు, దాడులు, హత్యలు అత్యాచారాలు మితిమీరి పోతున్నాయన్నారు. తనపై వాస్తవాలను చూపలేని 14 కేసులు బనాయించారని, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడులు చేయించి ఆయనపైనే అక్రమ కేసులు బనాయించారని అన్నారు. చిల్లకూరు ఎస్‌ఐగా పని చేస్తున్న సురేష్ బాబు పక్షపాత ధోరణిలో అక్రమ కేసులు బనాయిస్తే భవిష్యత్తులో ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ రౌడీ షీటర్ల పుట్టిన రోజు వేడుకలకు కూటమి నేతలు వెళ్లడంతో వారికి ఎక్కడలేని ధైర్యం వచ్చి దాడులు, హత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ పాలకుల అవినీతి అరాచకాలను ప్రజలు ప్రశ్నిస్తారని డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ ఇలా నాయకులపై అక్రమ కేసులు బనాయించడం సబబు కాదని అన్నారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ నేడు కూటమి నాయకులు అభివృద్ధి, పాలన రెండూ గాలికి వదిలివేశారని అన్నారు. సమావేశంలో కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు అనిల్‌బాబుతోపాటు గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మల్లు విజయకుమార్‌రెడ్డి, యద్దల మధుసూదన్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డితోపాటుగా గూడూరు, సూళ్లూరుపేట, కోవూరు నెల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

రూ.కోటి పరిహారమివ్వాలి

చిల్లకూరు: గూడూరు మండలం తుంగపాళెం సమీపంలో ఉన్న కలర్ షైన్ పరిశ్రమలో శనివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పరిశ్రమ ఎదుట ఆదివారం వారు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మృతి చెందిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఆదిత్యకుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని వారి బాగోగుల కోసం ఆ కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడ్డ కార్మికులకు రూ.50 లక్షలు, స్వల్పంగా గాయపడిన కార్మికులకు రూ.25 లక్షల పరిహారం అందించాలని కలర్ షైన్ పరిశ్రమను డిమాండ్ చేశారు.

గ్రంథాలయ పితామహుడి జయంతి

రాపూరు: మండలంలోని గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘననివాళులర్పించారు. గాడిచర్ల సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాడిచర్లకు ఘన నివాళి

కలువాయి(సైదాపురం): మండల కేంద్రంతోపాటు కుల్లూరు గ్రామాల గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ పితామహుడు గాడి చర్లహరి సర్వోత్తమరావు జయంతి సందర్భంగా గ్రంథాలయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గాడిచర్ల హరి సర్వోత్తమరావుకు నివాళులర్పిస్తున్న పాఠకులు

శిథిల భవనాల్లో గ్రామ పరిపాలన

- గ్రామ సచివాలయాలకు రక్షణ కరువు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

దొరవారిసత్రం : గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి సేవ ప్రజలకు క్షేత్ర స్థాయిలోనే అందేలా గత ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రజల ముంగిటకే ప్రభుత్వ ఫలాలు, సంక్షేమ పథకాలు అందే విధంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. దీంతోపాటు సచివాలయం సిబ్బందికి సైతం అన్ని సదుపాయాలు, వసతులు కల్పించి భవన నిర్మాణాలు చేపట్టింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేయడంతో పాటు అసంపూర్తిగా ఉన్న సచివాలయాలకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ఇందులో కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరిన అద్దె భవనాల్లో, పంచాయతీ భవనాల్లో కొనసాగుతుండడంతో ఆయా ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలకు రక్షణ కరువైంది.

మండల పరిధిలోని 11 గ్రామ సచివాలయాలకు గాను నెలబల్లి, పోలిరెడ్డిపాళెం, పూలతోట, తనియాలి గ్రామ సచివాలయాలు మాత్రం గత ప్రభుత్వంలోనే భవన నిర్మాణాలు పూర్తి చేసి పరిపాలన కొనసాగించింది. మీజూరు, తల్లంపాడు, ఉచ్చూరు, కొత్తపల్లి, కల్లూరు గ్రామ సచివాలయాల భవనాలు అంపూర్తిగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లోని పంచాయతీ భవనాల్లోనే గ్రామ సచివాలయాలు కొనసాగుతున్నాయి. వేణుంబాకం, ఏకొల్లు గ్రామ సచివాలయాలు మాత్రం శిథిలావస్థకు చేరిన అద్దె భవనాల్లో సచివాలయ సిబ్బంది పలు ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఏకొల్లు ప్రాంతంలోని అద్దె సచివాలయం ఊరికి దూరంగా కంప చెట్ల మధ్య బూత్ బంగ్లా తలపించే భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ సిబ్బందికి కానీ భవనానికి కానీ ఎలాంటి రక్షణ లేకుండాపోయిందనే విమర్శలు వస్తున్నాయి. కల్లూరు పంచాయతీ భవనంలో గ్రామ సచివాలయం నిర్వహిస్తున్నారు. ఈ భవనానికి చెందిన కిటికీలు, తలుపులు దెబ్బతినడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానిక సిబ్బంది ఆరోపిస్తున్నారు. వేణుంబాకంలో గ్రామ సచివాలయం నిర్వహణ ఓ అద్దె ఇంటిలో నానాతిప్పలు పడుతూ సిబ్బంది నడుపుతున్నారు. మీజూరులో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయం భవనంలో కొంత భాగం ఆ సిబ్బందే సిద్ధం చేసుకుని అతి కష్టం మీద విధులు నిర్వర్తిస్తున్నారు.



మీజూరులో పాచిపట్టి శిథిలావస్థకు చేరిన భవనంలోనే కొనసాగుతున్న గ్రామ సచివాలయం



కల్లూరులో గ్రామ పంచాయతీ భవనం దుస్థితి

పాఠశాలకు అడ్డంగా శిథిలాలు

పెళ్లకూరు: శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను తొలగించి అందులో ఉన్న కలప, ఐరన్ దిమ్మెలు తీసుకున్న కూటమి నేతలు మిగిలిన శిథిల భవన వ్యర్థాలను పాఠశాలకు అడ్డంగా వదిలేసి వెళ్లిపోయారు. మండలంలోని చిల్లకూరులో 1956లో ప్రభుత్వ పాఠశాల భవనాలను ఇనుప దూలాలు, టేకు లాదులు, సున్నం కట్టడాలతో నిర్మించారు. 1988లో మరో అదనపు భవనం నిర్మించారు. ఆ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని మూసివేసి వేరే భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే గ్రామ పెద్దలు కూటమి నేతలతో కలిసి శిథిలావస్థ భవనాలను తొలగించారు. తొలగించిన భవనాల్లో ఉన్న ఐరన్ దిమ్మెలు, కలప తరలించుకునిపోయారు. అయితే ఈ నిర్మాణ వ్యర్థాలను పాఠశాలకు అడ్డంగా శిథిలాలను వదిలేశారు. దాంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై ఎంఈవో శంకరయ్యను వివరణ కోరగా శిథిలాలను దూర ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపడతామన్నారు.



పాఠశాలకు అడ్డంగా పడేసిన శిథిల భవన వ్యర్థాలు